

చెరువును తలపిస్తున్న సీసీ రోడ్డు

ముత్తారం: కాసర్లగడ్డలోని 9, 10 వార్డుల్లోని నలుమూలల చౌరస్తా వద్ద కొద్దిపాటి వర్షానికి సీసీ రోడ్డు చెరువును తలపించడంతో.. స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రయాణం నరకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు పట్టించుకొని చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



వైభవంగా బీరన్న లగ్నపట్నం

ఎలిగేడు: ఎలిగేడు, లలితపల్లి గ్రామాల యాదవ, కుర్మ సంఘం ఆధ్వర్యంలో బీరన్న పట్నాల ఉత్సవాల్లో భాగంగా సోమవారం బీరన్నస్వామి లగ్నపట్నాన్ని వైభవంగా నిర్వహించారు. బీర్ల పూజారులు పట్నం వేయగా.. స్వామివారికి యాదవ, కుర్మ కులస్తులు మొక్కుబడులు చెల్లించుకున్నారు.



రామగుండం: జిల్లాపరిషత్ హైస్కూల్ వెనక వైపున్న కాలనీలో ఓ భారీ వృక్షం పూర్తిగా ఎండిపోయి కూలిపోయే స్థితిలో ఉంది. కార్పొరేషన్, విద్యుత్ శాఖ సిబ్బంది ఎండిపోయిన వృక్షాన్ని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. ఈదురు గాలులకు కుప్పకూలితే సమీపంలోని విద్యుత్ తీగలు, స్తంభాలు ఇళ్లపై పడే ప్రమాదముంది.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

క్లుప్తంగా

ప్రమాదానికి కారణమైన కాంట్రాక్టర్‌కు జైలు

గోదావరిఖనిటౌన్: మట్టి కుప్పలను రోడ్డుపై ఉంచి, సింగరేణి ఉద్యోగి మృతికి కారణమైన రామగుండం నగరపాలక సంస్థ కాంట్రాక్టర్ జంగంపల్లి విశ్వతేజకు ఏడాది జైలు శిక్ష, రూ.3వేల జరిమానా విధిస్తూ గోదావరిఖని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వెంకట సచిన్‌రెడ్డి సోమవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. స్థానిక గౌతమినగర్‌కు చెందిన ఓసీపీ–3లో పంప్ ఆపరేటర్‌గా పనిచేసే మేడిపల్లి నారాయణ 2017 అక్టోబరు 20న ఉదయం ద్విచక్ర వాహనంపై విధులకు వెళ్తున్నాడు. పోతనకాలనీ పాత పెట్రోల్ బంక్ సమీపంలో పైప్‌లైన్ మరమ్మతు చేయాల్సిన కాంట్రాక్టర్.. జంగంపల్లి విశ్వతేజ నిర్లక్ష్యంగా, ప్రమాద హెచ్చరికలు లేకుండా మట్టికుప్పలను రోడ్డుపై ఉంచారు. వాటిని తప్పించబోయి మేడిపల్లి సత్యనారాయణ అదుపుతప్పి ద్విచక్ర వాహనం పైనుంచి కింద పడ్డాడు. తలకు బలమైన గాయాలతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడు కార్తీక్ ఫిర్యాదు మేరకు అప్పటి టూటౌన్ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు కేసు నమోదు చేశారు. కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ప్రస్తుత సీఐ ప్రసాదరావు ఆధ్వర్యంలో కోర్టు డ్యూటీ ఆఫీసర్ మల్లేశం సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ నహీద పర్వీన్ వాదనలు వినిపించారు. దీంతో నేరం రుజువైంది. ఈమేరకు శిక్ష ఖరారు చేస్తూ జడ్జి తీర్పు చెప్పారు.

సంక్షేమ పథకాల్లో అర్హులకు అన్యాయం

రామగుండం: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో అసలైన లబ్ధిదారులకు అన్యాయం జరుగుతోందని, దళారీ వ్యవస్థను అడ్డుకొని క్షేత్రస్థాయి విచారణ చేపట్టి అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని సోమవారం అంతర్గాం తహసీల్దార్ తూము రవీందర్‌పటేల్‌కు బీజేపీ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. బోడకుంట సుభాష్, ఆలకుంట మల్లేశ్, ఆవుల విజయ్‌పాల్‌యాదవ్, తమ్మనవేణి మల్లేశ్, మిడివెల్లి అంజి, బాలసాని సత్యంగౌడ్, మాడ ప్రభాకర్‌రెడ్డి, ఆకుల హరీశ్ తదితరులున్నారు.

తాగునీటి ప్లాంటుకు అనుమతివ్వాలి

సుల్తానాబాద్: సుల్తానాబాద్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న తాగునీటి ప్లాంటుకు అనుమతివ్వాలని క్లబ్ ప్రతినిధులు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ మహమ్మద్ నియాజ్‌కు సోమవారం వినతిపత్రాన్ని అందించారు. మున్సిపల్ పరిధిలోని పూసాలలో ప్రజలకు అతి చౌకగా శుద్ధ జలమందించే ప్లాంటుకు గతంలో షెడ్డు నిర్మాణం పూర్తి చేశామన్నారు. క్లబ్ అధ్యక్షుడు మాటేటి సంజీవ్‌కుమార్, జిల్లా చీఫ్ కోఆర్డినేటర్ వలస నీలయ్య, కోఆర్డినేటర్ మాటేటి శ్రీనివాస్, జూపల్లి తిరుమల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరణ



రామగుండం: రామగుండం తహసీల్దార్‌గా నాయబ్ తహసీల్దార్ శ్రీపాద ఈశ్వర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఉన్న దత్తు ప్రసాద్ బాధ్యతలు స్వీకరించిన 20 రోజులకే బదిలీపై వెళ్లడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. నాయబ్ తహసీల్దార్‌కు ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించారు.

ఇసుక, మట్టి తరలిస్తే చర్యలు

ఎలిగేడు: మండలంలో అక్రమంగా ఇసుక, మట్టిని తరలిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ యాకన్న అన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ట్రాక్టర్, జేసీబీ యజమానులతో సమావేశం నిర్వహించారు.

లోకాయుక్తలో కేసుల విచారణ

మంథని: సూరయ్యపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో అనుమతి లేని రియల్ ఎస్టేట్ వెంచర్, గ్రామ పంచాయతీల్లో జరిగిన ఉపాధిహామీ పథకం అమలుపై జరిగిన అక్రమాలపై లోకాయుక్త చేసిన ఫిర్యాదుల నేపథ్యంలో రెండు కేసులు విచారణకు వచ్చినట్లు మంథనికి చెందిన హైకోర్టు న్యాయవాది ఇనుముల సతీశ్ తెలిపారు. అనుమతి లేని రియల్ ఎస్టేట్ వెంచర్‌పై 2022లో, మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో జరిగిన ఉపాధిహామీ పథకంలోని అక్రమాలపై 2021లో చేసిన ఫిర్యాదులపై విచారణ జరిగిందన్నారు.



జ్యోతినగర్: మొక్క నాటుతున్న బీజేపీ నాయకులు



రామగిరి: మొక్క నాటుతున్న బీజేపీ నాయకులు

గొప్ప నేత శ్యామాప్రసాద్ ముఖర్జీ

జ్యోతినగర్: దేశ భద్రత, సమగ్రతకు పాటుపడిన గొప్ప నేత శ్యామాప్రసాద్ ముఖర్జీ అని భారతీయ జనతా పార్టీ రామగుండం నియోజకవర్గ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి అన్నారు. సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో జనగామ, ఎన్టీపీసీ మండలాల్లో మొక్కలు నాటారు. జనగామ మండల అధ్యక్షుడు గుండబోయిన భూమయ్య, ఎన్టీపీసీ మండల అధ్యక్షుడు మిట్టపల్లి సతీశ్, శ్రీనివాస్‌శర్మ, గుండెబోయిన వెంకటయ్య, పోలె రాజు తదితరులున్నారు.

యైటింక్లయిన్‌కాలనీ: ప్రతీ ఒక్కరు మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని బీజేపీ యైటింక్లయిన్‌కాలనీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శశికుమార్ అన్నారు. శ్యామాప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా స్థానిక బీజేపీ కార్యాలయ ఆవరణలో నాయకులతో కలిసి మొక్కలు నాటి మాట్లాడారు. బీజేపీ సీనియర్ నాయకులు రాజు, దాసరి శ్రీనివాస్, మారపల్లి శ్రీను, లింగం నాయక్, కుమార్‌గౌడ్, అనిల్‌కుమార్, సురేశ్, సమ్మయ్య పాల్గొన్నారు.

గోదావరిఖని: స్థానిక జీఎంకాలనీ సంజీవఆంజనేయస్వామి దేవాలయంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి మొక్కలు నాటారు. నాయకులు గుండెబోయిన భూమయ్య, గుండబోయిన వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

రామగిరి: ప్రతీ ఒక్కరు శ్యామాప్రసాద్ ఆశయాలను కొనసాగించాలని బీజేపీ మండల అధ్యక్షుడు కొండ లక్ష్మణ్ పిలుపునిచ్చారు. సెంటినరికాలనీలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మొక్కలు నాటారు. తోట్ల రాజు, కొత్త కమాలాకర్, రోడ్డ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్‌రూరల్: గట్టెపల్లి గ్రామంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి కొల్లూరి సంతోష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మొక్కలు నాటారు. కందుల శ్రీనివాస్, మహేందర్, తిరుపతి, రాజేంద్రప్రసాద్ తదితరులున్నారు.

మత్తు పదార్థాల నియంత్రణపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఏసీపీ ఉపేందర్‌రెడ్డి

గోదావరిఖనిటౌన్: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం కరీంనగర్ నార్కోటిక్ బ్యూరో, ఆర్ఎస్‌సీసీ ఆధ్వర్యంలో గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏసీపీ ఉపేందర్‌రెడ్డి విద్యార్థులకు మాదక ద్రవ్యాలతో కలిగే అనర్థాలపై వివరించారు. సీఐ కృష్ణమూర్తి, ఎస్‌ఐ భూమేశ్, సిబ్బంది శ్రీనివాస్, మధుసూదన్, సంపత్, వినోద్, పాఠశాల హెచ్‌ఎం భూమయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిస కావొద్దని, చదువుపై దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని గోదావరిఖని ఏసీపీ మడత రమేశ్‌గౌడ్ సూచించారు. మత్తు పదార్థాల వ్యతిరేక అవగాహన వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక సెక్రెడ్ హార్ట్ పాఠశాలలో గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణపై విద్యార్థులకు అవగాహన, పిల్లలతో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఎస్సై రమేశ్, భూమేశ్, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాలకుర్తి: బసంత్‌నగర్‌లోని ఇండియా మిషన్ సెకండరీ పాఠశాల విద్యార్థులకు సోమవారం స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్సై స్వామి పాల్గొని విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. హెడ్ కానిస్టేబుల్ నరేందర్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓదెల: పర్యావరణంతో కాలుష్యాన్ని నివారించొచ్చని పొత్కపల్లి ఎస్సై దికొండ రమేశ్ అన్నారు. సోమవారం పొత్కపల్లి హైస్కూల్‌లో విద్యార్థులతో కలిసి 100 మొక్కలను నాటారు. గంజాయి, డ్రగ్స్ వంటి పదార్థాలకు అలవాటు పడొద్దన్నారు. ఏఎస్సై లక్ష్మీరాజం, కానిస్టేబుళ్లు, ఉపాధ్యాయులు అమృతకిషోర్, ఇట్టం శ్రీనివాస్ పాల్గొన్నారు.

మొక్కలు నాటిన బజరంగ్‌దళ్



మొక్క నాటుతున్న నాయకులు

గోదావరిఖనిటౌన్: దేశవ్యాప్తంగా బజరంగ్‌దళ్ అఖిల భారత పిలుపు మేరకు వృక్షారోహణం మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక కోదండ రామాలయంలో మొక్కలు నాటారు. బజరంగ్‌దళ్ జిల్లా సంయోజక్ ముష్కె సంపత్‌యాదవ్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా సేవా సప్తాహం పేరుతో వృక్షారోహణం మొక్కలు నాటే కార్యక్రమం ప్రతీ సంవత్సరం బజరంగ్‌దళ్ నిర్వహిస్తుందన్నారు. విశ్వహిందూ పరిషత్ నాయకులు అడిగొప్పుల రాజు, మునిగాల సంపత్, బండ రాజేశం, మేడగోని అరవింద్, మద్దెల శ్రీనివాస్, బాలు, వినయ్, కుమార్, శివ, కిరణ్, నరేశ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న కనకరాజ్

గోదావరిఖని: రామగుండం నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లలో పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలని సీపీఐ నగర కార్యదర్శి కె.కనకరాజ్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక భాస్కర్‌రావు భవన్‌లో జరిగిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ఓపెన్ డ్రైనేజీల్లో మురుగు నీరు ఉండి దోమల బెడద ఎక్కువైందన్నారు. వర్షాకాలం కావడంతో ఈ పరిస్థితి మరింత ఎక్కువగా ఉంటుందని అన్నారు. రోడ్లపై వర్షం నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నాయకులు మద్ది ఎల్లాగౌడ్, గోసిక మోహన్, తాళ్ల పెల్లి మల్లయ్య, మాటేటి శంకర్, తొడుపునూరి రమేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి పరీక్షలు తప్పనిసరి



మట్టిని సేకరిస్తున్న అధికారులు

సుల్తానాబాద్‌రూరల్: మియ్యాపూర్ గ్రామం పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక కాగా.. సోమవారం వ్యవసాయ అధికారులు రైతుల వ్యవసాయ భూముల్లోంచి మట్టి శాంపిళ్లను సేకరించారు. మట్టి పరీక్షలతో భూఆరోగ్యం, ఏ పంట సాగు చేస్తే దిగుబడి వస్తుంది, ఎరువులు ఎంత వాడాలో మట్టి పరీక్షల్లో తెలుస్తుందని ఏఈవో రవితేజ తెలిపారు. రైతులు తప్పనిసరిగా మట్టి పరీక్షలు చేయించుకోవాలని కోరారు.

పాఠశాలపై చర్యలు తీసుకోవాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గోదావరిఖనిటౌన్: పట్టణంలోని నారాయణ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రేణికుంట్ల ప్రీతం అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీకి వినతిపత్రం అందజేశారు. ప్రీతం మాట్లాడుతూ.. విద్యార్థుల తల్లిదండ్రుల వద్ద అధిక ఫీజులు వసూలు చేస్తూ, అధిక ధరలకు పుస్తకాలను విక్రయిస్తూ నారాయణ పాఠశాల యాజమాన్యం ఆర్థిక దోపిడీకి పాల్పడుతోందన్నారు. నాయకులు నాగరాజు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దపల్లిరూరల్: జిల్లాలో ప్రభుత్వం నుంచి అనుమతులు పొందకుండానే పాఠశాలలకు ఆకర్షణీయమైన పేర్లు పెట్టి విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని రాష్ట్రీయ హిందూపరిషత్ జిల్లా అధ్యక్షుడు జాపతి రాజేశ్ డిమాండ్ చేశారు.

త్వరలో ఆర్‌ఎఫ్‌సీఎల్‌కు కొత్త సీజీఎం

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం ఎరువుల కర్మాగారం సీజీఎంగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఉదయ్ రాజహంస జూన్ 30న విరమణ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. గతంలో సీజీఎంగా బాధ్యతలు నిర్వహించిన బంగార్ బదిలీపై వెళ్లడంతో.. ఆర్ఎఫ్‌సీఎల్ సైట్‌లో డీజీఎంగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఉదయ్ రాజహంస సీజీఎం, ప్రాజెక్ట్ ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టారు. ఈనెల 30తో పూర్తి కావడంతో ఆర్ఎఫ్‌సీఎల్ సీజీఎంగా ఎవరు వస్తున్నారనే చర్చ సాగుతోంది. ఆయన స్థానంలో ప్లాంట్‌లో సీనియర్ అధికారి రమేశ్ ఠాకూర్ లేదా ఢిల్లీ నుంచి కూబే సీజీఎం బాధ్యతలు చేపట్టేందుకు అవకాశాలున్నాయని తెలిపారు.

అక్రమ కేసులు ఎత్తేయండి

పెద్దపల్లిరూరల్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నుంచి బీఆర్ఎస్ నేతలపై అక్రమ కేసులు బనాయిస్తూ పోలీసులు వేధించడం పరిపాటిగా మారిందని మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం విలేకరులతో మాట్లాడారు. మాజీ మంత్రి కేటీఆర్ ఏసీబీ విచారణకు హాజరయ్యే రోజున ఓదెలలో బీఆర్ఎస్ కార్యకర్తలు దిష్టిబొమ్మను దహనం చేస్తే పోలీసులు వారిపై కేసులు నమోదు చేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. కేసులు ఎత్తేయాలని డిమాండ్ చేశారు. నాయకులు శ్రీకాంత్‌గౌడ్, సురేశ్‌గౌడ్, శ్రీనివాస్, రమేశ్, నరేశ్, మణికంఠ, అరుణ్‌కుమార్ తదితరులున్నారు.

పూడికతీత పనులు

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థ పరిధిలోని 27, 49, 50 డివిజన్ల పరిధిలో మురుగునీటి కాలువల్లో సోమవారం సిబ్బంది పూడిక తొలగింపు పనులు చేపట్టారు. పనులను బల్దియా డిప్యూటీ కమిషనర్ వెంకటస్వామి పర్యవేక్షించారు.

బహుమతులు అందజేత

పెద్దపల్లిరూరల్: పెద్దకల్వల మాజీ సర్పంచ్ నర్ల లక్ష్మి జ్ఞాపకార్థం సోమవారం క్రికెట్ పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన జట్లకు బహుమతులను అందించడంతోపాటు క్రీడాకారులకు క్రికెట్ బ్యాట్లను నాయకుడు నర్ల పోల్‌రాజు అందజేశారు. నాయకులు రాములు, రాజేశం, మల్లయ్య తదితరులున్నారు.

మొక్కుబడిగా సామాజిక తనిఖీ ప్రజావేదిక

మంథని: ఉపాధిహామీ పథకంలో భాగంగా మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల్లో జరిగిన పనులపై నిర్వహించిన సామాజిక తనిఖీలో వెల్లడైన అంశాల బహిర్గతానికి ఏర్పాటు చేసిన సామాజిక తనిఖీ ప్రజావేదికను అధికారులు మొక్కుబడిగా మమ అనిపించారనే ఆరోపణలున్నాయి. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజావేదికలో కేవలం రూ.37,963 రికవరీ చేసినట్లు అధికారులు ప్రకటించారు.

కంటి వైద్యశిబిరం

రామగిరి: కల్వచర్ల గ్రామ పంచాయతీ పరిధిలోని గోకుల్‌నగర్‌లో సోమవారం లయన్స్ క్లబ్ అధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. మాజీ జెడ్పీటీసీ గంట వెంకటరమణారెడ్డి, డాక్టర్ శరణ్య సహకారంతో ఏర్పాటు చేసిన శిబిరంలో 55 మందికి పరీక్షలు నిర్వహించారు. 25 మందికి కంటి ఆపరేషన్ అవసరం కాగా.. వారిని రేకుర్తి కంటి ఆసుపత్రికి తరలించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ములుక్మారి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు కళాధర్‌రెడ్డి, డైరెక్టర్లు మేకల మారుతి, పరంకుశం శ్రీనివాసాచారి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన కేంద్రంగా తీర్చిదిద్దడమంటే ఏమిటో చెప్పాలి

మంథని: మంథని ప్రాంతాన్ని విజ్ఞాన కేంద్రంగా తీర్చిదిద్దడమంటే ఏమిటో మంత్రి జవాబు చెప్పాలని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ప్రశ్నించారు. సోమవారం మంథనిలో అసంపూర్తిగా నిలిచిపోయిన జేబీఎస్ బాలుర పాఠశాలను సందర్శించారు.

సింగరేణి వార్తలు

చెడు అలవాట్లకు బానిసవ్వొద్దు



నియామక పత్రం అందజేసిన జీఎం సుధాకర్‌రావు

రామగిరి: సింగరేణి సంస్థలో ఉద్యోగం రావడం ఒక వరమని, చెడు అలవాట్లకు బానిసై విధులకు గైర్హాజరు కావొద్దని ఆర్జీ–3 జీఎం నరేంద్ర సుధాకర్‌రావు అన్నారు. సోమవారం ఆర్జీ–3 ఏరియాలోని వివిధ గనులు, విభాగాల్లో విధులు నిర్వహిస్తూ అనారోగ్య కారణాల వల్ల మెడికల్ ఇన్వాలిడేషన్, మృతిచెందిన ఉద్యోగులకు సంబంధించి ఐదుగురికి కారుణ్య నియామక ఉద్యోగ ఉత్తర్వులను అందజేశారు. జీఎం మాట్లాడుతూ.. ఉన్నత చదువులు చదివినా.. ప్రభుత్వ ఉద్యోగానికి ఉన్న ప్రాధాన్యం గుర్తించి సింగరేణి సంస్థలో బదిలీ వర్కర్ ఉద్యోగంలో చేరుతున్నారని తెలిపారు. సీనియర్ ఉద్యోగుల సలహాలు, సూచనలు తీసుకొని భవిష్యత్తులో మరెన్నో పదవులు పొందాలని, సంస్థ అభివృద్ధికి తోడ్పడాలన్నారు. గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు వై.వి.రావు ఎం.రామచంద్రారెడ్డి, కోట రవీందర్ రెడ్డి, సాయికృష్ణ, పర్సనల్ మేనేజర్ బి.సుదర్శనం, డీవైపీఎం వి.సునీల్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఏపీఏ ఇన్‌చార్జి జీఎం బండి సత్యనారాయణ

రామగిరి: ఆర్జీ–3, ఏపీఏ ఏరియాల్లో నిర్వహిస్తున్న ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఏపీఏ ఇన్‌చార్జి జీఎం బండి సత్యనారాయణ అన్నారు. సోమవారం స్థానిక స్కిల్ డెవలప్‌మెంట్ ట్రెయినింగ్ సెంటర్‌లో రెండు వారాలపాటు నిర్వహించనున్న ఉచిత సోలార్ టెక్నీషియన్ శిక్షణ తరగతులను ఆర్జీ–3 ఎస్‌వోటూ జీఎం ఎం.రాంమోహన్‌తో కలిసి ప్రారంభించారు. సింగరేణి సంస్థ ఉద్యోగుల కుటుంబ సభ్యుల కోసమే కాకుండా పరిసర ప్రాంతాల నిరుద్యోగ యువత కోసం ఎన్నో నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. ఈ శిక్షణను సద్వినియోగం చేసుకొని నైపుణ్యాన్ని సంపాదించి ఉపాధి అవకాశాలను మెరుగుపర్చుకోవాలని అన్నారు. ఎంవీటీసీ మేనేజర్ సుజిత్, డీఎస్ఈ శ్రీనివాస్, శిక్షకుడు తేజావత్ అశోక్ పాల్గొన్నారు.

లాభాల వాటా అందించాలి

గోదావరిఖని: ఆర్థిక సంవత్సరం ముగిసి మూడు నెలల గడుస్తున్నా సింగరేణి కార్మికులకు రావాల్సిన లాభాల వాటా యాజమాన్యం అందించడం లేదని సీఐటీయూ ఆర్జీ–1 కార్యదర్శి మెండె శ్రీనివాస్ అన్నారు. సోమవారం పత్రిక ప్రకటన విడుదల చేశారు. సంస్థను లాభాల్లోకి తీసుకొచ్చిన చరిత్ర సింగరేణి కార్మికులదేనన్నారు. సంస్థకు వచ్చిన లాభాలను చెప్పడానికి మూడు నెలలు పడుతోందని అన్నారు. అత్యాధునిక టెక్నాలజీ వినియోగిస్తున్న సింగరేణి సంస్థ లాభాల వాటా చెల్లించడంలో ఎందుకు జాప్యం చేస్తోందని ప్రశ్నించారు. పవర్, సోలార్ విద్యుత్ రంగంలో అడుగుపెట్టడంతో సంస్థ గణనీయమైన అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందన్నారు.

బీఎంఎస్‌లో చేరిక



కండువా కప్పి ఆహ్వానిస్తున్న రాంచందర్

జ్యోతినగర్: రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్టీపీసీకి చెందిన ఐఎన్‌టీయూసీ జాతీయ నాయకుడు బండారి కనకయ్య ఆ సంఘానికి రాజీనామా చేసి సోమవారం భారత్ మజ్దూర్ సంఘ్(బీఎంఎస్)లో చేరారు. జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డెపల్లి రాంచందర్ ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి ఆహ్వానించారు. బండారి కనకయ్యను తెలంగాణ స్టేట్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్(రామగుండం), తెలంగాణ యూనిట్ అధ్యక్షుడిగా నియమిస్తూ బీఎంఎస్ బలోపేతానికి కృషి చేయాలని కోరారు.

వాన పడాలని పూజలు



ఓదెల: ఓదెలలో వర్షాలు కురవాలని మాజీ ఎంపీటీసీ బొడకుంట చిన్నస్వామి ఆధ్వర్యంలో చిన్నయ్య పెద్దయ్యకు పూజలు చేశారు. స్థానిక ఊరగుట్టకున్న చిన్నయ్య పెద్దయ్య బండకు గ్రామస్తులు డప్పుచప్పుళ్లతో బయలుదేరి టెంకాయలు కొట్టారు. బండరాయిపై నీళ్లు పోసి పూజలు చేశారు.

రాజేశ్వరస్వామి ఆలయంలో రుద్రాభిషేకం



అన్న ప్రసాదం వితరణ చేస్తున్న దాతలు

జూలపల్లి: మండల కేంద్రంలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఆలయ అర్చకుడు ఉద్దండ నవీన్ రుద్రాభిషేకం నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. దాతలు అన్నప్రసాద వితరణ చేశారు.

నిధులు మంజూరు చేయాలి

ఓదెల: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో రజకుల ఆరాధ్య దైవమైన మడేలేశ్వరస్వామి దేవాలయాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని రజక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొల్లురి కుమార్ కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కు కరీంనగర్‌లో సోమవారం వినతిపత్రం అందజేశారు.